## క్లుప్తంగా

### మహిళా దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్, టీఎన్జీవోస్ బాధ్యులు

**ఖమ్మం సహకారనగర్:** టీఎన్జీవోస్ మహిళా విభాగం ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనుండగా ఈ మేరకు రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాస్, మహిళా విభాగం చైర్‌పర్సన్ జి.మృదుల, కన్వీనర్ బీ.వీ.సుబ్బమ్మ, శీలం రాధికారెడ్డి, విజయ, శ్రీనివాసరావు, వెంకటమ్మ, వెన్నెల, కోమలి, శ్రావణి, హసీనా, వసంత, రమ్య, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

**క్రచ్ సెంటర్‌లో తనిఖీ..**

కలెక్టరేట్ ఆవరణలో ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటుచేసిన క్రచ్ సెంటర్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజువారీగా ఎందరు పిల్లలు ఉంటున్నారు, సెంటర్‌లో వసతులపై ఆరా తీసిన ఆయన వేసవి దృష్ట్యా ఏసీ ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, సెంటర్ ఇన్‌చార్జ్ రాణి పాల్గొన్నారు.

### 9న రవన్న వర్ధంతి

**ఖమ్మంరూరల్:** ఈనెల 9న ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు సుభాష్‌చంద్రబోస్ (రవన్న) వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని ఎం.వెంకటాయపాలెంలో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు బండెల వెంకయ్య, మలీదు నాగేశ్వరరావు, మారుతి, మల్లయ్య, ఉపేందర్, శ్రీను, లక్ష్మీనారాయణ, ఉదయ్, వెంకన్న, వీర్ల వెంకటప్పారావు ఉన్నారు.

### రేపు సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

**ఖమ్మం మామిళ్లగూడెం:** సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటుచేసినట్లు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. గత కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.

### విద్యుత్ ఎస్ఈని కలిసిన విశ్వబ్రాహ్మణ ప్రతినిధులు



ఎస్ఈని సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

**ఖమ్మంవ్యవసాయం:** ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈగా నియమితులైన ఇనుగుర్తి శ్రీనివాసాచారిని బుధవారం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. సంఘ ప్రతినిధులు సోమేశ్వరా చారి, వసంత బాబు, వీరబ్రహ్మాచారి, ఇనుగుర్తి వెంకటేశ్వర్లు, సదానందా చారి, పాపాచారిఉన్నారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | సంక్రాంతికి వస్తున్నాం |
| వినోద | తండేల్ |
| సాయిరాం | మజాకా |
| ఆదిత్య | డ్రాగన్ |
| శ్రీనివాస | ఛావా |

- ఖమ్మం గాంధీచౌక్

### ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 16 | బచ్చలికూర | 3 |
| వంకాయ | 28 | | 20 |
| బెండకాయ | 48 | పాలకూర | 3 |
| పచ్చిమిర్చి | 34 | | 20 |
| కాకర | 48 | చుక్కకూర | 3 |
| బీర | 48 | | 20 |
| దొండ | 44 | తోటకూర | 3 |
| పొట్లకాయ | 34 | | 20 |
| చిక్కుడు | 68 | గోంగూర | 4 |
| గోరుచిక్కుడు | 48 | | 20 |
| క్యాబేజీ | 20 | మెంతికూర | 2 |
| క్యాలీఫ్లవర్ | 30 | | 20 |
| ఆలుగడ్డ | 28 | కొత్తిమీర | 1 |
| చామగడ్డ | 44 | | 40 |
| క్యారెట్ | 28 | పుదీన | 1 |
| బీట్‌రూట్ | 24 | | 25 |
| క్యాప్సికం | 46 | -ఖమ్మం వ్యవసాయం | |

# పట్టాలెక్కని పాలన..

## ఏదులాపురం మున్సిపల్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే

- చుట్టపుచూపుగా వస్తున్న అధికారులు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- ఎల్ఆర్ఎస్‌పై సమాచారం ఇచ్చేవారే కరువు



పెదతండాలో ఇళ్ల సమీపంలో పేరుకుపోయిన మురుగునీరు

**ఖమ్మంరూరల్:** మండలంలోని 12 గ్రామ పంచాయతీలను విడదీసి కొత్తగా ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీని ఏర్పాటు చేయడంతో తమ సమస్యలు తీరుతాయని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అనుకున్నారు. కానీ ఇంతవరకు పాలన పట్టాలెక్కకపోవడంతో ప్రజలు కొంత అసహనానికి ఇబ్బందికి గురవుతున్నారు. గతంలో పంచాయతీలుగా ఉన్నప్పుడు ఎలాగూ బాధలు తప్పలేదని, ఇప్పుడు కూడా సంబంధిత అధికారులు పట్టించుకోట్లేదని వాపోతున్నారు.

**సమస్యల మయం..**

మున్సిపల్ పరిధిలోని పంచాయతీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. అప్పటి పంచాయతీల పాలన కంటే ఇప్పుడు పెద్దగా మెరుగ్గా ఏమీలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదులాపురం, పెదతండా లాంటి పెద్ద వార్డుల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా దర్శనమిస్తోంది. డ్రెయినేజీల్లో మురుగునీటిని, చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పెదతండా వార్డు కార్యాలయం పక్కనున్న వీధికినెలరోజులుగా తాగునీరు సరఫరా కాక ఇబ్బంది పడుతున్నా అధికారులకు కనిపించకపోవడం దారుణమని ప్రజలు వాపోతున్నారు. ఇక మున్సిపల్ పరిధిలోని మిగతా వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు చేయక వీధులన్నీ దుర్వాసనతో నిండి ఉన్నాయి. అయితే పారిశుద్ధ్యం పనులు చేయించడానికి తమకు మున్సిపల్ శాఖ నుంచి నిధులే రావడంలేదని, అందుకు సంబంధించి ఇంకా ఖాతాలే తెరవలేదని, పాత పంచాయతీల్లో ఉన్న నిధులతోనే ఇప్పటి వరకు నెట్టుకొస్తున్నట్లు వార్డు అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు సమస్యల విషయమై మున్సిపల్ తాత్కాలిక ఇన్‌చార్జి ఎంపీడీఓ కుమార్‌ను వివరణ కోరగా అక్కడక్కడ వార్డుల్లో పారిశుద్ధ్యం సమస్యలపై ప్రస్తుతం విధుల్లో ఉన్న కార్యదర్శులతో సరి చేయిస్తున్నట్టు తెలిపారు. మరి కొద్ది రోజుల్లో సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.

**అధికారుల సమాచార మేది..?**

ప్రజలు తమ సమస్యలు చెప్పుకుందామని ఏదులాపురం, పెదతండాలలో పాత పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్యాలయానికి వస్తే అక్కడ ఎవరూ స్పందించట్లేదని, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలనే కనీస సమాచారాన్ని ఏర్పాటుచేయకపోవడంతో వారు చేసేదేమీ లేక ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లిపోవడం నిత్యకృత్యమైంది. పోనీ ఫోన్ చేద్దామంటే అక్కడి బోర్డులపై సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు లేవని, కనుక్కుని చేసినా ఫోన్ ఎత్తిన పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ పథకానికి దరఖాస్తు చేయడానికి ఎలా చేయాలి, ఎవరికీ ఇవ్వాలి అనే దానిపై స్పష్టత లేదు. ఒక్క ఏదులాపురం, పెదతండా వార్డుల్లోనే పదివేల పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇక మిగతా పది పాత పంచాయతీల పరిధిలో వేలల్లోనే ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు వచే అవకాశం ఉంది. ఇంత పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను స్వీకరించడానికి తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంది.

**మున్నేటి పక్కనే చెత్త డంపింగ్..**



పెదతండాకు సంబంధించిన చెత్తను డంప్ చేయడానికి తెల్దారుపల్లిలో డంపింగ్‌యార్డు ఉన్నప్పటికీ అక్కడకు తరలించకుండా జలగంగనర్ పక్కనే ఇళ్లకు సమీపంలో చెత్తను డంప్ చేస్తుండటంతో అటు ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతుండగా మున్నేటి నీరు కూడా కలుషితమవుతోంది.

**నెలరోజులుగా తాగునీరు రావడం లేదు**

నెలరోజుల నుండి తాగడానికి నీరు రావడంలేదు. రోజూ డబ్బులు పెట్టి మినరల్ వాటర్ కొంటున్నాం .అసలే ఎండాకాలం వచ్చింది. తాగడానికి నీళ్లలేకపోతే ఎలా ఉండాలి. వెంటనే తాగునీరు అందించాలి. - బి.స్వరూప, పెదతండా

**దుర్వాసన తట్టుకోలేకపోతున్నాం**

డ్రెయినేజీల్లో మురుగునీరు, చెత్తాచెదారం చేరి దుర్వాసన వస్తోంది. ఏదైనా పండుగయినా, పై అధికారులు చెకింగ్ వచ్చినప్పుడు మాత్రమే చెత్తను మురుగునీటిని తొలగిస్తారు. దోమలు చేరి అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా మురుగునీటిని, చెత్తను తీయాలి.

- భూక్యా శాంతికుమారి, పెదతండా

## 58 కులాలకు న్యాయం జరగాలి



డప్పుల మహా ర్యాలీలో నాయకులు

**ఖమ్మం మామిళ్లగూడెం:** జనాభా దామాషా ప్రకారం మాదిగ ఉపకులాలతోపాటు 58 కులాలకు న్యాయం జరగాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య, జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మాదిగ ఉపకులాలకు 11శాతం రిజర్వేషన్ ఫలాలు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ బుధవారం పెవిలియన్ గ్రౌండ్ నుంచి జెడ్పీ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పులతో మహార్యాలీ నిర్వహించారు. మాదిగలకు రాష్ట్ర క్యాబినేట్‌లో తక్షణమే రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, సునీల్, వంగూరి ఆనందరావు, ఈదయ్య, నరసింహారావు, రాము, శ్రీను, ప్రభాకర్, రత్నాకర్, గోపాలరావు, రాజేష్, నాగభూషణం, రవి, సురేష్, మోహన్, ఏసన్న, అశోక్, నాగేశ్వరరావు, వెంకటరత్నం, వెంకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఉపాధి కల్పించాలి

**నేలకొండపల్లి:** మండలంలోని పైనంపల్లి టోల్‌గేట్ వద్ద దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీవీ.చలమయ్య కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని దివ్యాంగులకు అర్హతను బట్టి టోల్‌గేట్‌లో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అనంతరం స్థానిక ఎస్‌జీఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో వ్యాపార నైపుణ్యం శిక్షణ పొందిన దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందించారు. నాయకులు భాస్కర్‌రావు, కొరివి వీరన్న, రామకృష్ణ, నాగరాజు, పుల్లయ్య ఉన్నారు.

### చలివేంద్రం ఏర్పాటు

**ఖమ్మంరూరల్:** మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో మదీనా టెంట్ సహకారంతో భాస్కర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ బుధవారం ప్రారంభించారు. నాయకులు వెంపటి సురేందర్, దండి రంగారావు, వెన్నం భాస్కర్, రాము, వినయ్, వంశీ, ఆనంద్, వడ్లకుండ. వీరబాబు, శేఖర్, కృపాకర్, ఉదయ్, శ్రీరంగం సాయి పాల్గొన్నారు.

### రాకాసితండా సమస్యలు పరిష్కరించాలి

**తిరుమలాయపాలెం:** భారీ వర్షాలు వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా ప్రజలను ఆదుకోవాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ పివి.రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. వరద ముంపునకు గురైన వారిని వేరే ప్రాంతంలో ఇళ్లు కట్టిస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరడంలేదని, కోతకు గురైన వ్యవసాయ భూములను బాగుచేస్తామని చెప్పినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### పురపాలకంతో పాలన సులభం



మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

**ఖమ్మంవన్‌టౌన్:** పంచాయతీలతో పోలిస్తే పురపాలకంతో పాలన సులభంగా మారుతుందని, మంత్రి పొంగులేటి సహకారంతో ఏదులాపురం నూతన మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, టీపీసీసీ మెంబర్ ధరావత్ రాంమ్మూర్తినాయక్ అన్నారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ పరిధిలోని 12 గ్రామాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ బైరు హరినాథబాబు, కళ్లెం వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

### విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ఖమ్మం మామిళ్లగూడెం:** జిల్లాలో పరీక్షల సమయంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు లక్షల కొద్ది ఫీజులు వసూలు చేస్తూనే భోజనవసతి సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, సదరు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్ గౌడ్ మాట్లాడుతూ... ఫీజులు కట్టలేని విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వమని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. చంద్రశేఖర్, రామకృష్ణ, రామకోటి, రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

### ఘనంగా ఫేర్‌వెల్ డే

**ఖమ్మంరూరల్:** మండలంలోని రాజీవ్‌గృహకల్పలో గల హార్వెస్ట్ స్ప్రింగ్‌లీఫ్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఫేర్‌వెల్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పి.రవికుమార్, డైరెక్టర్ ఆర్.పార్వతీరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ బి.రవిశంకర్, ఎం. ప్రతి ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్ రవికుమార్, డైరెక్టర్ పార్వతీరెడ్డి

### న్యాయవాదుల సమస్యలపై వినతి



నగేష్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

**ఖమ్మంలీగల్:** మాదిగ కో ఆర్డినేషన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్‌కు న్యాయవాదుల సమస్యలపై పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. కమిటీ తరఫున శాలువాతో సత్కరించారు. అదేవిధంగా బార్ కౌన్సిల్ కార్యదర్శి నాగలక్ష్మిని కలిసి సీఓపీ విషయంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నూతన జీపీ గణేష్‌ను సత్కరించారు. మాదిగ కోఆర్డినేషన్ కమిటీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ నాగేశ్వరరావు, కోశాధికారి అరుణ్ కుమార్, కల్చరల్ కన్వీనర్ పమ్మి రవి ఉన్నారు.

### సన్మానం

**ఖమ్మం మామిళ్లగూడెం:** బీజేపీ నాయకులు చీకోటి ప్రవీణ్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు సన్నే ఉదయప్రతాప్ నివాసానికి బుధవారం రాగా వారికి ఘన స్వాగతం పలికి సన్మానించారు. పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లపు వెంకటేశ్వర్లు, నాయకులు డాక్టర్ శీలం పాపారావు, వెంకటేశ్వరరావు, వేములపల్లి వెంకన్న, శ్రీనివాసరావు, నకిరికంటి వీరభద్రం, మేకల నాగేందర్, దుర్గాప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ, శాసనాల సాయిరాం, రవి గౌడ్, శ్రీనివాస్, పమ్మి అనిత, ప్రభాకర్, రమణ, రాజేష్, సుదర్శన్ ఉన్నారు.

### ఇళ్ల స్థలాల కోసం పోరాటం

**ఖమ్మం సహకారనగర్:** జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం ఒంటరిగా పోరాడాలని టీడబ్ల్యూజేఎఫ్ నిర్ణయించినట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని మంచికంటి ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 10 నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభం అవుతుందన్నారు. నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, జక్కంపూడి కృష్ణ, మోహన్ రావు, నాగుల్ మీరా తదితరులు ఉన్నారు.

### వీధికుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

**నేలకొండపల్లి:** వీధి కుక్కల స్వైరవిహారం చేయడంతో మండల కేంద్రంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. నేలకొండపల్లికి చెందిన పిట్టల మరియన్న, శ్రీను, చెక్కల నాగార్జున, ఉమామహేశ్వరి, కృష్ణవేణి బుధవారం తమ వీధిలో వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయి. దీంతో స్థానికులు వాటిని తరిమివేసి గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## కేఎంసీ సమాచారం..

**➡ పన్ను చెల్లించకుంటే నల్లా కట్..**

**ఖమ్మంమయూరిసెంటర్:** కేఎంసీ ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పనులతోనే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ఈ పన్నులను వందశాతం వసూలు చేసేందుకు అధికారులు లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నారు. దానిలో భాగంగా 92 మంది తో బృందాలను ఏర్పాటు చేసి పన్నుల వసూలుకు నెలరోజులుగా ప్రత్యేక కార్యచరణ తీసుకున్నారు. దీనిలో భాగంగా రెడ్ నోటీసులు ఇవ్వడంతో పాటు భారీగా పన్ను బకాయి ఉన్న బకాయిదారులపై చర్యలకు తీసుకునేందుకు ఉపక్రమించారు. తొలుత రెడ్ నోటీసులు ఇచ్చి తర్వాత బకాయిదారులను పన్ను చెల్లించేలా అవగాహన కల్పించి, వారం రోజుల తర్వాత సంబంధిత భవనాల పంపు కనెక్షన్ తొలగిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం నగరంలోని పలు డివిజన్లో పలువురి పంపుల కనెక్షన్లను తొలగించారు. ఇంటి, పంపు పన్ను వసూళ్లలో ఆర్వో అండ్ ఆర్ఐ బిల్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టి ఇంటి పన్ను కట్టకుండా ఉండి రెడ్ నోటీస్ ఇచ్చినా కూడా కట్టని భవనాలకు మున్సిపల్ అధికారులు పంపు కనెక్షన్‌ను తొలగించారు. పాత బకాయిదారులు పన్ను చెల్లించాలని, బకాయిదారులకు మూడు రోజులు సమయం ఇచ్చామన్నారు. కట్టని పక్షంలో పంపు కనెక్షన్లు తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు కేఎంసీకి రూ.36 కోట్లు పన్నులు రాబట్టాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటి వరకు రూ.22 కోట్లుకు పైగా వసూలు చేశారు.



ఇంటికి రెడ్‌నోటీస్ అంటించిన సిబ్బంది

➡ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా హార్టికల్చర్ ఆఫీసర్ బుధవారం గార్డెన్ సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

➡ టౌన్‌ప్లానింగ్ అధికారులు బైపాస్ రోడ్డు లెవెల్ అప్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఉన్న రోడ్డును విస్తరించడం కోసం 60 అడుగుల మార్కింగ్ ఇచ్చారు.

➡ మున్సిపల్ అధికారులు డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి వైరా రోడ్డులో డివైడర్, రోడ్డును ఆక్రమించి పెడుతున్న హోర్డింగ్‌లు, దుకాణాల ముందు అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు, పండ్ల వ్యాపారుల తోపుడు బండ్లు తొలగించారు.

## ఉపాధి హామీ పనులపై ప్రజాదర్బార్



వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాసరావు

**ఖమ్మంరూరల్:** మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 2023 నుండి 2024 మధ్య కాలంలో మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై అధికారులు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన పనులపై సిబ్బంది సామాజిక తనిఖీ చేసి అధికారులకు నివేదిక సమర్పించారు. ఈ నివేదికలపై అడిషనల్ డీఆర్‌డీఓ చుంచు శ్రీనివాసరావు పంచాయతీల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్‌లను, మేట్‌లను, గ్రామ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల్లో చేసిన పనికి, హాజరు పట్టికలో వేసిన మస్టర్లకు సరిపోలకపోవడంతో వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పనికి రాకున్నా పనికి వచ్చినట్టు హాజరువేస్తూ కొందరు సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, ఏపీఓ శ్రీదేవి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

**కామేపల్లి:** గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని డీఎల్‌పీఓ రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని రుక్కితండా గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. వననర్సరీలోని మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఏపీఓ ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి ఫజల్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

### ఆయిల్‌పామ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ

**కూసుమంచి:** మండలంలోని గురువాయిగూడెంలో పామాయిల్ సాగుపై బుధవారం మండల వ్యవసాయాధికారి రామడుగు వాణి రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సాగుచేస్తున్న పంటల్లో పామాయిల్ సాగుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ పంటతో రైతులు మంచి ఆదాయం చేకూరుతుందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ, ప్రోత్సాకాలను అందిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఓ ప్రియాంక రైతులు ఉన్నారు.

### సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

**ఖమ్మం మామిళ్లగూడెం:** గిరిజన సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఈ మేరకు గిరిజన సమాఖ్య సమావేశం బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో బానోత్ బచ్చారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను గిరిజన ప్రాంతాల్లోనే ఖర్చు చేయాలన్నారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి మాట్లాడుతూ... చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేసి అర్హత కలిగిన పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**కూసుమంచి:** ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని కస్తూర్బా కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం వద్ద ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. డిపార్ట్‌మెంటల్ అధికారి నాగలక్ష్మీ, చీఫ్ సూపరిండెంట్, ఎస్ఓ అజితకుమారి పరీక్షను పర్యవేక్షించారు.

**తిరుమలాయపాలం:** మండలంలోని తిరుమలాయపాలెం కేజీబీవీ, పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాల్లో 299 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 277 మంది హాజరాయ్యరు. ఎస్సై కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

**నేలకొండపల్లి:** మండలంలోని సింగారెడ్డిపాలెం గురుకుల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్షాకేంద్రాల్లో 410 మంది హాజరవ్వాల్సి ఉండగా 390 మంది పరీక్ష రాశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉద్యోగి



కూసుమంచి: పరీక్షాకేంద్రం వద్ద పోలీసులు



సిబ్బంది ఫోన్లను అందజేస్తున్న ఉపాధ్యాయుడు



తిరుమలాయపాలం: పిండిప్రోలులో..



నేలకొండపల్లిలో..